# Visakhapatnam Apartments Residents Welfare Association (VARWA)

# &   NIVAS

---

**గౌ. శ్రీమతి గొలగాని హరి వెంకట కుమారి గారు,** **తేదీ : 06.08.2021**

**నగర మేయరు,**

**జీవీఎంసీ,**

**విశాఖపట్నం.**

**అమ్మా !**

**విషయం : ఈ నెల 07 వ తేదీ జీవీఎంసీ సమావేశంలో ఆస్తి పన్ను పెంపుదల నోటిఫికేషన్ రద్దు చెయ్యాలని విజ్ఞప్తి.**

1. **ఆస్తి పన్ను పై చర్చించేందుకు ఈ నెల 07 వ తేదీన జరుగనున్న జీవీఎంసీ కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని అపార్టుమెంట్లు, కాలనీల సంఘాలైన ' వార్వా నివాస్' గా ఆహ్వానిస్తున్నాము. జూన్ 03 జీవీఎంసీ కమీషనర్ గారి నోటిఫికేషన్ పై నగర ప్రజలు వెలిబుచ్చిన అభిప్రాయాలూ, సూచనలు, అభ్యంతరాలను పరిగణన లోనికి తీసుకొని నోటిఫికేషన్ రద్దు చెయ్యాలనే నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాము.**
2. **అద్దె విలువ ఆధారిత ఇంటి పన్ను Stamps and Registration డిపార్ట్మెంట్ వారు ఏటేటా నిర్ణయించే ఆస్తి విలువ ఆధారంగా వసూలు చేసే పద్ధతికి మార్చితే ఇంటి పన్ను భారాన్ని విశాఖ ప్రజలు తట్టుకోలేరు. ఇంటిని అమ్ముకునే టప్పుడు లభించే ఆస్తి విలువ ను ఏటేటా వచ్చే ఆదాయం గా పరిగణించ లేము. కాబట్టి, అద్దె ఆధారంగా పన్ను విధించడమే సమంజసం.**
3. **మార్కెట్ విలువలో నివాస గృహాలకు 0.15% , ఇతర గృహాలపై 0.30%, ఖాళీ స్థలాలపై 0.50% ఆస్తి పన్ను విధిస్తామని ప్రకటించారు. దీని వల్ల కొత్త పన్ను పాత పన్ను కి 3 నుండి 6 రెట్లు పెరిగే ప్రమాదముంది. కమర్షియల్ షాప్స్ కి కూడా పెద్ద భారమే పడుతుంది. పైసా రాబడి లేని ఖాళీ స్థలాలపై పన్ను మరీ దారుణం. పాత పద్ధతిలో నివాస ప్రాంతాన్ని బట్టి, బిల్డింగ్ స్ట్రక్చర్ బట్టి, బిల్డింగ్ వయస్సు ని బట్టి కొన్ని రాయితీలు ఇస్తున్నారు. కొత్త పద్ధతిలో అవేవీ లేవు.**

4. చిన్న పాటి ఋణ అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వ షరతులకు లొంగి ప్రజలపై భారాలు పెంచడం అన్యాయం.
5. కొత్త పద్ధతి వద్దు. పాత పద్ధతే ముద్దు అని నగర ప్రజలు భావిస్తున్నారు. పన్ను పద్ధతి మార్పు, భారీగా పన్నులు, యూజర్ ఛార్జీల వడ్డింపులను వ్యతిరేకిస్తూ ప్రజలు కరోనా, కర్ఫ్యూ ల వలన ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని మరీ వేలాది అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఆస్తి పన్ను పై Change.org లో వేసిన రెండు పిటిషన్ల పై 6000 మంది పైగా సంతకాలు చేశారు. వీటిని బట్టి ప్రజల్లో దీనిపై ఉన్న వ్యతిరేకత అర్థం చేసుకోవచ్చు.
6. నగరంలో రెవెన్యూ ఆదాయం పెంచుకోవడానికి క్రమశిక్షణతో పన్ను చెల్లించే వారిపై మరిన్ని భారాలు పెంచడం తగదు. ఎగ్గొట్టే వారి నుండి వసూలు చేసే విధానాలు కఠినతరం చెయ్యాలి.
7. గంగవరం పోర్టు, హిందూజా పవర్ ప్రాజెక్ట్ వంటి కంపెనీలకు ఆస్తి పన్ను రాయితీ లిచ్చారు. అన్నిరకాల మౌలిక సదుపాయాలను GVMC ఏర్పాటు చేస్తూ, పన్ను రాయితీలు ఎందుకివ్వాలి ? ఆ భారాలను మనపై ఎందుకు మోపాలి ?
8. ప్రభుత్వ ఆస్తులు, స్థలాలను ప్రభుత్వం ఇచ్చే రాయితీలను దుర్వినియోగ పర్చే వారి నుండి పినాల్టీ , అధిక పన్నులు వసూలు చెయ్యాలి. CRZ నిబంధనలకు తిలోదకాలిచ్చి కార్పొరేట్ బిల్డర్స్ పెద్ద పెద్ద ఆకాశాన్నంటే భవనాలను నిర్మిస్తున్నారు. అలాంటి వారి పైన చర్యలు తీసుకొని, పినాల్టీలు వసూలు చెయ్యాలి, అధిక మొత్తంలో పన్నులు వెయ్యాలి.
9. సామాన్యులను ఇబ్బందులకు గురి చెయ్యకుండా, ఇలా ఇతర మార్గాల్లో GVMC ఆదాయం పెంచుకోవాలి.
10. కరోనా, లాక్డౌన్, కర్ఫ్యూ ల వలన ప్రజలకు కలిగిన కష్టాలు ఇప్పట్లో తీరేవి కావు. తెలంగాణా, గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో రాయితీలు, మినహాయింపులు ఇచ్చారు. ఈ విధంగా విశాఖ ప్రజలకు కూడా రాయితీలు, మినహాయింపులు ఇచ్చే విధంగా GVMC కౌన్సిల్ లో నిర్ణయించాలని తమకు విజ్ఞప్తి చేస్తున్నాము.
11. ప్రతి ఏడాదీ పాత పన్నుపై 15% కి మించకుండా పెంచుతారని పత్రికల ద్వారా తెలుస్తున్నది. ఇంతవరకు అమలులో ఉన్న పన్నుల విధానంలో ఐదేళ్లకు ఒకసారి పెంచాలి. ప్రతి ఏటా 15% అంటే చాలా ఎక్కువ పన్ను భారం ప్రజలపై పడుతుంది. ఐదేళ్లలో ఈ పన్ను రెట్టింపు అయి పోతుంది. కాబట్టి, ఐదేళ్లకు ఒకసారి పెంచే విధానాన్నే కొనసాగించాలి. 15% కంటే తక్కువ పెంచేలా నిర్ణయించాలి.
12. 375 చ. అ. ల లోపు ఇంటి వైశాల్యం ఉన్న పేదవారి గృహాలకు అందులో నివసించినా, లేకున్నా సరే రు. 50/- లు మాత్రమే పన్ను వసూలు చెయ్యాలి.
13. కొత్త గృహాలకు పాత పన్ను ఉండదు. వారికి నేరుగా కొత్త పన్ను విధించడం అన్యాయం. కాబట్టి, వారికి కూడా పాత పద్ధతిలోనే పన్ను విధించాలి.

14.ఖాళీ స్థలాలపై పైసా రాబడి రాదు కనుక ఖాళీ స్థలాలపై పన్ను రద్దు చెయ్యాలి.

15.పన్నులు భారీగా పెంచితే సకాలంలో చెల్లించడం అందరికీ, ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలకు మరియు చిన్న చిన్న వ్యాపారస్తులకు సాధ్యం కాదు. Defaulters పెరుగుతారు. పన్ను చెల్లించలేని స్థాయికి పెంచి, పన్ను చెల్లించ లేదని పినాల్టీ వెయ్యడం సరి కాదు. వీరు ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టే వారు కాదు. పన్ను చెల్లించ గలిగే స్థాయికి పెంచితే వీరంతా పన్ను సకాలంలో చెల్లించే వారే. కాబట్టి, పన్ను చెల్లించ గలిగే స్థాయికి మాత్రమే పెంచండి. పినాల్టీ లు ఉపసంహరించండి.

16. ఈ ఏడాదికి చాలా మంది ఇప్పటికే పన్నులు చెల్లించి వున్నారు. కావున, పన్నుల పెంపుదల పాత తేదీ నుండి అమలు చేయరాదని, రాబోయే ఏడాదిలో అమలు చెయ్యాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

17. 8% చొప్పున వసూలు చేసిన లైబ్రరీ సెస్సు ఇప్పటికే 90 కోట్ల రూపాయలకు పైగా జీవీఎంసీ వద్ద వుంది. ఈ మొత్తాన్ని వెంటనే గ్రంధాలయ సంస్థ కి విడుదల చేసి, జిల్లా గ్రంథాలయాన్ని వెంటనే నిర్మించాలి, ఇతర గ్రంథాలయాలను అభివృద్ధి చెయ్యాలి.

18. చెత్త, మురుగు నీరు, తాగు నీరు, వీధి లైట్లు, రోడ్ల నిర్వహణ వంటి పౌర సేవలు జీవీఎంసీ యొక్క బాధ్యతలు. వీటిని అందించడం కోసమే ఆస్తి పన్నులు చెల్లిస్తున్నాము. కాబట్టి, పౌర సేవలకు అదనంగా యూజర్ చార్జీలు వసూలు చెయ్యడం అన్యాయం. కాబట్టి, జీవీఎంసీ పునరాలోచించి, యూజర్ చార్జీలను రద్దు చెయ్యాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

పైన పేర్కొన్న అంశాల మీద సంపూర్ణంగా చర్చించి, విశాఖ ప్రజలకు ఇబ్బంది కలుగని రీతిలో వారి చేత ఎన్నుకోబడిన జీవీఎంసీ ప్రతినిధులుగా ప్రజాస్వామ్యాన్ని పరిపుష్ఠమ్ చేస్తూ నిర్ణయాలను చేస్తారని ఆశిస్తూ...

ఇట్లు

| | |
|---|---|
| BB గణేష్ | P నారాయణ మూర్తి |
| ప్రధాన కార్యదర్శి | ప్రధాన కార్యదర్శి |
| VARWA | NIVAS |

-------------------------------------------------------------------------------------------

B 25, Jeevan Soudha Apartments, MMTC Colony, HB Colony PO, Visakhapatnam, AP State – 530022. Mobile : 9440133400; 9491789269 .